
కథానిక

# చినుకులు

- శిరంశెట్టి కాంతారావు

కృష్ణా పుష్కరాలకోసమని ఇరవై ఏండ్ల తరువాత మళ్ళీ జగ్గయ్యపేటలో అడుగు పెడుతున్న నా గుండె కనుమల్లో పుట్టిన ఉద్వేగపుజాలు అంతంతకూ విస్తృతమై ఉక్కిరి బిక్కిరి చెయ్య సాగింది...



నా ఆనందానికి స్పందించిన మేఘాలు 'చిట, పట' మంటూ కరిగించిన వెండి ముద్దల్ని వర్షిస్తుంటే... ఆ స్పర్శను ఆస్వాదిస్తూ... మెల్లగా ముక్త్యాల గమిడి వైపు కదిలాను....

ఆ... చిరుజల్లు కుంభవర్షమై ఈ ఇరవై ఏండ్లుగా విదేశీ ఎ.సి.ల కాలుష్యంతో పేరుకు పోయిన నా వంటిని పవిత్రీకరిస్తుంటే.. నల్లరేగడి మట్టిలా విచ్చిపోతూ ముక్త్యాల గమిడి చేరుకున్నాను.

'బండెడు చెడునైనా.. సహించే మనిషి, చిటికెడు మంచికి ద్రవించి పోతాడు. అన్నట్టు కురుస్తున్న వర్షానికి జనమంతా ఎక్కడెక్కడో తలదాచుకున్నట్టుంది. ఎవ్వరూ కన్పించడంలేదు! ఐతే... ఓ రెండు.. మూడు ఆటోలు మాత్రం ఆగిఉన్నాయి...

వర్షం మెల్ల, మెల్లగా వెలిసింది

అంతదాకా ఎక్కడెక్కడో తలదాచుకున్న

జనమంతా రోడ్డు మీద కొచ్చేశారు !

ఆటోలు తూడ్చుకుంటు "మూతాల, మూతాల! ఏలాద్రి, ఏలాద్రీ !" అంటు అరవ సాగారు ఆటోడ్రైవర్లు అప్పటిదాకా ఆశగా ఎదురు చూసినా... కరీంమియా జట్కా కన్పించక పోవడంతో నిరాశగా వేదాద్రి వెళ్ళే ఆటోలో ఎక్కికూర్చున్నాను.

నేను ఎక్కిన అర్ధగంట తరువాత ఏడెనిమిది మంది ప్రయాణీకుల్ని పిడకల్ని పేర్చినట్టు పేర్చిన తరువాతగాని ఆటోను బయలు దేరదీయలేదా ఆటోవాలా..!

ఆటో బయలుదేరడమే ఆలస్యం "బొయ్" మంటూ ఒక్కసారిగా టేప్‌రికార్డర్ ఆన్ చేశాడా

ఆటోవాలా ! అసలే ఒకరి వళ్ళో ఒకరం కూర్చుని నానా చికాకు పడుతుంటే.. మధ్యలో ఈ టేప్‌రికార్డర్ గోలేంటి? అనుకున్న నేను "బాబూ ! ఆ టేప్‌కొంచెం ఆపేయ్" అన్నాను.

అంతే....!!?

ఆటోలో ఉన్న వాళ్ళంతా నన్నో వింత జంతువును చూసినట్టు చూస్తూ.... "హే! ఉండనియ్" అన్నారు. వాళ్ళ చూపులతోనే సగం చచ్చిపోయిన నేను, వాళ్ళ మాటలతో మరింత చచ్చిపోతూ "ఇదేంటి వీళ్ళు ! ? అనుకుంటూ కళ్ళు మూసుకుని గతంలోకి జారి పొయ్యాను.

★ ★ ★

"హేయ్ జట్కా అబ్బీ ! వేదాద్రికొస్తావా ?" అడిగాడు మామయ్య ఆగిఉన్న జట్కా వాలాను. "వస్తాను బాబూ ! ఎక్కండి" అన్నాడు జట్కావాలా. అప్పటిదాకా జట్కాబండిని చూడ్డమేగాని, ఎక్కడం వీలు పడని నేను హుషారుగా ఎక్కి కూర్చున్నాను. నాతర్వాత నాన్న, మామయ్యా ఎక్కింతర్వాత ఇనుపకమ్మీని అడ్డుపెట్టి జట్కా ఎక్కిన జట్కావాలా ఒక్కసారిగా గుఱ్ఱం పగ్గాల్ని గుంజి వదులుతూ... "ఛల్‌రే! బేటా ! ఛల్ !" అంటూ చర్నాకోలాను "ఛళ్" మనిపించి గుఱ్ఱన్ని అదిలించాడు.

**అంతే....**

అప్పటిదాకా నెమరు వేస్తూ నిల్చున్న గుఱ్ఱం ఒక్క సారిగా పరుగందుకుంది.

గుఱ్ఱండెక్కల చప్పుడుతో, కుదుపులతో జట్కా పరుగులు తీన్తుంటే.... నరదాగా అన్పిస్తుంటే ఆ జట్కావాలా వైపు పరిశీలనగా చూశాను. ముప్పైఐదు, ముప్పై ఏడుకు మధ్య ఉంటాడేమో నని పించింది. ఖాకీ నిక్కర్ మీద, నీరు కారి తెల్లబుషట్ వేసు కున్నాడు. మెడలో ఏదో తావీజ్ వేళ్ళాడుతుంది. తలమీద గుడ్డటోపీ పెట్టు కున్నాడు.

నాన్న, మామయ్యా ముక్త్యాల కోట గురించి, ముక్త్యాల రాజాగారి గొప్పతనం గురించి మాట్లాడుకుంటున్నారు.

నేను రోడ్డు మీద పోతున్న మనుషుల్ని, రోడ్డు పక్క ఉన్న ఇండ్లను చూస్తూ.. కూర్చున్నాను.

జట్కా ఊరుదాటి రెండు ఫర్లాంగులు ముందు కొచ్చింది. అక్కడ రోడ్డుకి కుడి వైపున పెద్ద, పెద్ద కాలుతున్న సున్నం బట్టీలు కన్పిస్తున్నాయి. ఆ.. సున్నం బట్టీలు దాటంగానే రోడ్డు మెరక రావడంతో జట్కా వేగం తగ్గింది. వెంటనే జట్కావాలా "అరే! రామూబేటా ! జల్దీ భాగోరే!" అంటూ చేతిలోని ఛర్నాకోలాను 'ఛళ్ళు' మనిపించాడు జట్కా జయంతిపురం రోడ్డు మలుపు తిరిగింది.

జట్కా వాలానే గమనిస్తున్ననేను "ఏంటీ..! మీ గుఱ్ఱంపేరు రాముడా !? "అంటూ అడిగాను.

'ఔను బాబూ ! ఈ... ఏటి పట్టెమ్మటి పదూళ్ళల్లో మా రామూబేటాను కొట్టినోడు లేడు." తన గుఱ్ఱం గొప్పతనం గురించి ఉత్సాహంగా చెప్పసాగాడు జట్కావాలా.

అతను చెప్పిందంతా విన్న తరువాత "ఔనూ... ఇంతకీ నీ పేరేమిటి?" అతనెవరో తెలుస్తూనే ఉన్నా అడిగాను.

"కరీంమియా బాబూ ! అంతా.. జట్కాకరీం అంటారు" చెప్పాడతను.

"మరి నువ్ జూస్తే నేమో సాయిబ్‌గారివి ! నీ గుఱ్ఱం పేరేమో !"

"దాందేముంది బాబూ! మా ఊరి ప్రెసిడెంట్ గారి పేరు మస్తాన్‌రెడ్డి. ఆళ్ళేమో కాపులు; కావాల్సింది మంచి తనం గాని, పేర్లదేముంది బాబూ ! ఏపేరైనా పెట్టు కోవచ్చు" చెబుతున్న అతని ముందు నాకు నేనే మరు గుజ్జులా కన్పిస్తుంటే.... ఏద్వలేక నవ్వుతూ "ఔనూ.. ఈ జట్కా మీద రోజుకెంత సంపాదిస్తావ్?" అంటూ సంభాషణను వక్కదారి పట్టించాను.

"ఆ ! ఏం సంపాదనలే

## నెపోలియన్

స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వాల కోసం 1789 నుండి 1799 వరకు జరిగిన ప్రజా పోరాటమే "ఫ్రెంచి విప్లవం"గా పేరు పొందింది. ఈ పోరాటంలో తన పోరాట పటిమను ప్రదర్శించిన రణరంగ యోధుడు అయిన నెపోలియన్ ఆగష్టు 15, 1769వ సం॥లో జన్మించారు. ఫ్రెంచిలో 1799వ సం॥లో రాచరికపు వ్యవస్థ అంతం కాగానే నెపోలియన్ ఫ్రాన్స్ అధిపతి అయ్యారు.

బాబూ ! మేమాలు మగలం, నల్గురు పిల్లలు, మా; బాపు ఇంత మందిమి ఈ జట్కా మీదనే బతకాల. ఏదో ఆ.... ఏలాద్రి నర్సింసామి దయ. పొట్టకు, బట్టకు సావులేకుండ ఎల్లుది."

"తెలివైనవాడే ! నేనడి గిందానికి సమాధానం చెప్పకుండనే దాటవేశాడు" అనుకున్నా.

"ఇంతకూ మందేవూరు బాబూ!" అటువైపునుండి అడగడం మొదలైంది.

"భద్రాచలం"

"అబ్బా ! శానాదూరంనుంచొన్తుండ్రే! నర్సింసామి దర్శనానికా?"

"ఔను దేవుణ్ణి చూసుకొని గింజుపల్లి పోయిరావాలి"

"గింజుపల్లా !? ఎవలింటికి ?"

"నీకా ఊళ్ళో వాళ్ళంతాదెల్సా ?

"ఈ కిష్టమ్మటి పదూల్లల్లో ఈ జట్కా కరీంకు తెలియ నోళ్ళుంటారా !? అసలింతకూ మీ రెవలింటి కెలుతుండ్రు ?" చర్నాకోల కర్రను జట్కా చక్రానికి అనించి పెట్టడంతో "ట్రూ..ట్రూ.." మని వస్తున్న చప్పుడుతో గుఱ్ఱం హుషారెక్కి పరుగు పెంచుతుంటే అడిగాడు కరీంమియా....

★ ★ ★

ఆటో ఎందుకో ఆగిపోవడంతో ఆలోచనలు చెదిరి పోయి వాస్తవంలోకొచ్చాను.

ఉన్నవాళ్ళతోనే ఇరుకై ఛస్తున్నా పట్టించుకోని ఆటోవాలా ఇంకో ఇద్దరు ప్రయాణీకుల్ని ఇరికిస్తున్నాడు.

బయటికి చూశాను.

సరిగ్గా సున్నంబట్టీల దగ్గరకొచ్చాం. ఇప్పుడా రాళ్ళసున్నం వాడేనాథుడే లేక, పనిలేని సున్నం బట్టీలు శిధిలమై వాటి మీద జిల్లేడు పొదలు, సర్కార్ తుమ్మ చెట్లూ పెరిగిపోయి ఉన్నాయి.

ఎక్కడ జిల్లేళ్ళు మొలిచాయో... అక్కడ పడాగు పడ్డట్టే లెక్క... మనిషి ప్రాధాన్యతలు మారుతుంటే

**పింగళి వెంకయ్య**

ఆగష్టు 2, 1878వ సం॥లో కృష్ణాజిల్లా, బట్లపెనుమర్రు గ్రామంలో జన్మించిన పింగళివెంకయ్య బొంబాయిలో సైనికుడిగా తర్ఫీదుపొంది ఆఫ్రికా వెళ్ళారు. 1911 - 1919 మధ్యకాలంలో బందరు జాతీయ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. ఈయన బొగ్గు వజ్రంగా మారే విధానాన్ని గూర్చి "తల్లిరాయి" అనే పుస్తకం వ్రాశారు. 1921లో గాంధీజీ ఆదేశానుసారం త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు. గాంధీ సూచన మేరకు దానిపై రాట్నం గుర్తును చేర్చారు. 13-4-1921 నాటి **"యంగ్ ఇండియా"** పత్రికలో గాంధీజీ పింగళి వెంకయ్యగారిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

వాటితో పాటు అనేక మార్పులు సంభవించి కొన్ని ఉపయోగం లేకుండాపోతే కొన్ని కొత్తవి వచ్చి చేరుతాయి.

ఆటో తిరిగి బయలు దేరింది.

ఆలోచనలు తేనెటీగల్లా ముసురుకున్నాయి.

★ ★ ★

"వగడాల రామ నర్సయ్యగారింటికి"

"ఓహో వగడాలోల్లింటికా?!"

"ఆయనన్నీకు తెల్సా ?" మా సంభాషణ వింటున్నాడేమో మామయ్య హఠాత్‌గా అడిగాడు. "తెలియకేం ! ఆ ఊరికాయనే పెద్దరైతు. శానమంచోడు. ఇంటికెవలు బోయినా... అన్నందినకుండ బోనియ్యడు" కరీంమియా వివరించాడు.

అదే అదనుగా నాన్న, మామయ్యలు రామనర్సయ్య గారి వివరాలు కూపీ లాగడం మొదలు పెట్టారు.

అడిగినవాటికి సమాధానాలు చెప్పిన కరీంమియా "ఏందిబాబూ ! ఏ మన్న పెల్లి ముచ్చట్లకు బోతుండ్రా? అంటూ కుతూహలంగా అడిగాడు.

"ఔను. మా చెల్లికి సంబంధం చూద్దామని వెళుతున్నాం." చెప్పాన్నేను

"ఆ.. మధ్యవర్తి చెప్పిందానికీ, ఇతను చెబుతున్న దానికీ తేడా ఏం లేదు బావా ! ఈ సంబంధం ఖాయంజేస్తేనే పోయేట్టుంది." మంత్రాంగం మొదలు పెట్టాడు మామయ్య.

"చూద్దాం ! తినబోతూ రుచడగడమెందుకు!?" నాన్న గుంభనం షరామామూలే...

"మీ అమ్మాయిగారా ఇంట్లో పడితే సుఖపడుద్ది బాబూ ! తలవెనక్కి తిప్పి చూస్తూ అన్నాడు కరీం.

"ఇదుగో అబ్బీ ! నీ నోటి వాక్యాన సంబంధం కుదిర్తే... అమ్మాయి పెళ్ళిలో నీకో బట్టల జత పెడతావోయ్." కరీంమియాతో అన్నాడు మామయ్య.

మామయ్య మాటలకు సిగ్గుపడుతూ "నాకెందుకు బాబూ ! ఆ... నర్సింసామి దయుంటే సాలుగాని ఏదైనా జర్గద్ది." గుఱ్ఱాన్ని అదిలిస్తూనే అన్నాడు కరీం మియా.

మాటల్లోనే జట్కా జయంతిపురం ఊళ్ళో కొచ్చింది.

కరీంమియా జట్కాబండినోకొట్టుముందాపి కిందకు దిగాడు. దిగుతూ, దిగుతూనే ఎడమ పక్క మేకు పైకి రావడం గమనించి రోడ్డు ప్రక్కనే ఉన్న రాయినొకదాన్ని తీసుకొని మళ్ళీ లోపలికి కొట్టాడు.

కాళ్ళూ, చేతులు కాస్త సళ్ళొదులు తాయని మేమూ కిందకుదిగి అలా ముందుకెళ్ళాం. ఊరికి నైఋతిమూలలో ఉన్న కోట గత ప్రాభవాన్ని కోల్పొయి, విషాద గంభీరంగా కన్పిస్తుంది. ఆ కోట చుట్టూ వేసుకున్న గిరిజనుల చిన్ని, చిన్ని పూరి గుడిసెలు దారిద్ర్యాన్ని శ్వాసిస్తున్నాయి.

జట్కా కింద జాలీలో ఉన్న కిరాణా సరుకుల మూటల్ని దుకాణంలో అప్పగించి మా వైపు జూస్తూ "రాండి బాబూ !పోదాం రాండి !" అంటు పిలిచాడు కరీంమియా.

★ ★ ★

ఓ.... కుదుపుతో ఆటో మళ్ళీ ఆగడంతో కరీం మియా జ్ఞాపకాల్లో నుండి బయటపడ్డాను.

"ఎక్కడి దాకా వచ్చామో" అని బైటికి చూసే సరికి ఏదో ఓ... కొత్త కాలనీలో ఆగిఉంది! ఈ కాలనీ ఎప్పుడు కట్టారు" పక్క ప్రయాణీకుణ్ణి అడిగాను.

"ఐదారేండ్లైంది. ఈ చుట్టు పక్కల క్వారీల్లో, సిమెంట్ ఫ్యాక్టరీల్లో పన్జేసే వాళ్ళకోసం కంపెనీ వాళ్ళే కట్టిచ్చారు."

''ఓహో ! అలాగా !'' అంటూ చుట్టు వక్కల పరజూశాను. ఈ కొండల మద్యకూడా నాగరికత తాలూకా వికృత రూపం బడ్డీ కొట్లముందు కూల్డ్రింకులూ, గుట్కా దండల రూపంలో దర్శనమిస్తున్నాయి. దూరంగా ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలు వెలువరిస్తున్న పొగ, దుమ్ము, ధూళీ మేఘాల్లా తేలివస్తూ.... చుట్టూ ఉన్న చిట్టడవిని బూడిద కుప్పలుగా మారుస్తున్నాయి.

"ఓ సారీ.... ఆటోవాలా నడిగితే కరీంమియా ఆచూకేమైనా చెబుతాడేమో" అనుకొని "బాబూ !ఇంతకు ముందీరోడ్డులో కరీంమియా అనే జట్కావాలా తిరుగుతుండేవాడు నీకేమైనా తెలుసా? అంటూ అడిగాను.

"తెలియదు" పుల్ల విరిచినట్టుగా చెప్పాడు.

"ఇదే.. కరీంమియా ఐతే...?" మళ్ళీ నాలో ఆలోచన్లే.

★ ★ ★

మేం ఎక్కి కూర్చున్న తరువాత జట్కా కదిలింది.

మెరక మీద నిదానంగా నడిచిన గుఱ్ఱం కాస్తా పల్లం రాగానే దౌడు తియ్యసాగింది. ఆ.... పరుగుచూసి భయపడిన మామయ్య" అరే ! మియా ! గుఱ్ఱంకాలు జారేను జాగ్రత్త" అడ్డు పెట్టిన ఇనుప కమ్మీని గట్టిగా పట్టుకుంటూ.

లేదుబాబూ ! మా రాముడి గురించి మీకు తెలియదు. వాడికీ రోడ్లన్నీ కొట్టినపిండే.. ఎక్కడ? ఎట్లా నడవాలో వాడికి బాగా దెల్సు" చెప్పాడు కరీంమియా.

అద్సరేగాని, గింజాపల్లికిప్పుడు పడవుంటుందా? అడిగాడు నాన్న.

"నమ్మకం తక్కువ బాబూ! మద్దెనాలైందిగా... పడవాల్లంతా గింజాపల్లోల్లే. నావను ఆవలి రేవుల్లో వదిలి అన్నాలకు బొయ్యుంటారు."

''అయ్యో ఇప్పుడెలా మరి? సాయంత్రానికల్లా తిరిగెళ్ళాలే...'' దీర్ఘం తీస్తూ అన్నాడు మామయ్య.

''ముందాడికి పోనియ్యండి సూద్దాం'' ఏదో ఉపాయం ఆలోచించొచ్చులే అన్నట్టుగా అన్నాడు కరీంమియా

మాటల్లోనే జట్కావచ్చి గుడికి కొంచెం ఈవలగా ఉన్న మర్రి గున్నకిందాగింది.

**జంధ్యాల పాపయ్య శాస్త్రి**

విజయశ్రీ, కరుణశ్రీ, ఉదయశ్రీ కలం పేర్లు కలిగిన మధురకవి శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి. ఉమర్ ఖయ్యాం, పుష్పవిలాపం (ఘంటసాల గానం చేశారు) మొదలైన కవితా ఖండికలు బహుళ జనాదరణ పొందాయి. మృదు మధురమైన పద్య రచనా శైలి వీరి ప్రత్యేకత. కరుణశ్రీ ఆగష్టు 4, 1912వ సం॥లో జన్మించారు.

"అరే... బేటా ! రామూ ! భలేవాడ్వీరా ! మాటల్లోబడి సూన్నేలే... సక్కగొచ్చి చెట్టు కిందాగినవే!" అంటూ గుఱ్ఱాన్ని మెచ్చుకుంటూనే బండెనక్కొచ్చి ఇనువకమ్మి తప్పినత్తా.... "దిగండిబాబూ!" అన్నాడు.

మేం దిగ్గానే గుఱ్ఱం మెడ మీదనుండి జట్కాబండిని తప్పించి రోజాకు కట్టేసి, జట్కాకింది జాలీలో ఉన్న పచ్చిగడ్డి తీసి దాని ముందు పడేశాడు.

**హిరోషిమా డే**

అమెరికా బి29 విమానం జపాన్‌లోని హిరోషిమా నగరం మీద ఆగష్టు 6, 1945వ సం॥లో ఉదయం గం॥ 8.15 ని॥లకు బాంబు వేసింది. అగ్ని జ్వాలలతోపాటు, అణు ధార్మిక శక్తి చెలరేగి 70 వేల మంది మరణించి ఉండవచ్చని అంచనా. అమెరికాకు 33వ అధ్యక్షుడైన (1945-52) హారీట్రూమన్ (1884-1972) హిరోషిమా, నాగసాకిలపై ఆటం బాంబులు వేయమని ఆదేశాలిచ్చాడు.

భక్తులు ఆ తల్లి ఒడిలో సుస్నానితులై ఆనందిస్తుంటే... మరి కొందరు వివిదాకృతుల్లో ఉన్న నునుపైన రాళ్ళను ఏరుకుంటున్నారు. తీగలు సాగిన నాచు పాయలు కృష్ణవేణి సిగలో పచ్చి వెలుగలిరేకుల్లా మెరుస్తున్నాయి.

కరీంమియా చెప్పినట్టు పడవ గింజుపల్లి రేవులోనే ఉంది. అప్పుడు మామయ్య కరీం మియావైపు తిరిగి "ఔనుకరీం ! నువు చెప్పినట్టు పడవ అటువైపే ఉందికదా ? ఏంజేద్దాం" అన్నాడు.

లోపలి గుడిలో భక్తులు కొడుతున్న గంట చప్పుడు కృష్ణానది తరంగాల్లోనూ.. చుట్టూ ఉన్న కొండల్లోనూ ప్రతిధ్వనిస్తూ... పవిత్ర దైవీభావన తనూ, మనస్సులను పునీకరిస్తుంటే.. గుడివైపు కదిలాము.

దైవదర్శనానికి ఆలయంలో ప్రవేశించాము.

వేదాద్రి నరసింహుడు పశ్చిమాభిముఖుడై కొలువుదీరి, దక్షిణ దిశగా సాగిపోతున్న కృష్ణవేణి హొయలను యోగానందుడై వీక్షిస్తూ... భక్తులను పాలిస్తున్నాడు.

మేము దైవదర్శనం చేసుకొని బయటికొచ్చే సరికి సింహద్వారము వెనుకనున్న జమ్మిచెట్టు నీడలో కూర్చుని కరీంమియా పులిహోరను కళ్ళకద్దుకొని తింటున్నాడు.

మనిషి బాహ్యంగా ఎన్నో పరిమితులకు లోబడి జీవించాల్సి వచ్చినా... అంత:కరణలో సార్వజనీనతా మూలాలకు అనుసంధానం చేయబడతాడు. అనేదానికి నిదర్శనం కరీంమియా అప్రయత్నంగానే ప్రసాదాన్ని కళ్ళకద్దుకొని తినడమే.

గుడి ఆవరణలో నుండి కృష్ణమ్మ ఒడిలోకి ఉన్న మెట్ల పైభాగంలో నిలబడి చూస్తున్న మాకు మేఘవర్ణంలో బిర,బిరా సాగిపోతున్న కృష్ణమ్మ తన శత సహస్ర అలల కరాలెత్తి ఆహ్వానగీతం పలుకుతున్నట్టుగా ఉంది. చిన్న, చిన్న నాటు పడవల్లో తిరుగాడుతున్న జాలర్లు చాపల వేటకు విసురుతున్న వలలు కళాత్మకంగా కదులుతున్నాయి. కొందరు

"ఏదోకటి చేద్దాం రాండి !" అంటు గుడి ఆవరణలోని ఆఫీసు రూం వైపు దారితీశాడు. అతని వెనుక మేమూ నడిచాం. సరాసరి ఆ.... ఆఫీస్ గుమస్తా దగ్గరకెళ్ళి "చూడండి గుర్నాధం బాబూ ? ఆ.... గింజుపల్లి రామనర్సయ్య గారింటికి చుట్టాలెవరో పెండ్లి చూపులకొస్తున్నారు. ఆ పన్జూసుకొని ఎమ్మటే తిర్గి పోవాల్నంట ! నావజూస్తే... ఆవలిరేవులో ఉంది." వివరించాడు కరీంమియా.

"రామనర్సయ్య గారింటికా ? అంటూ లేచిన గుమస్తా పక్కనే ఉన్న గది తాళం తీసి అక్కడున్న మైక్‌సెట్ ఆన్‌జేసి "హలో... హలో.... గింజుపల్లి రామనర్సయ్య గారింటికి చుట్టాలొస్తున్నారు, నరంగులు నావను గుడిరేవుకు ఎమ్మటే తీసుకురాండి!" అంటు మూడు నాలుగు సార్లు మైక్‌లో ఎనౌన్స్‌మెంటిచ్చాడు. మైక్‌లో.. ఆ ప్రకటన చుట్టూ ఉన్న కొండల్లో ప్రతిధ్వనించి ఎంతో దూరం విన్పిస్తుంది.

ఎనౌన్స్‌మెంటిచ్చిన గుమస్తాతో బాటు మేమంతా మెట్లపైన నిలబడి ఆవలిరేవులోకి చూడసాగాం... కొద్దిసేపట్లోనే రేవులోకి మనుషులు రావడం కన్పిస్తుంది! ఆ... వస్తున్న వాళ్ళల్లో ఒకడు తన వంటి మీది తువ్వాలును రెండు, మూడు సార్లు గాల్లోకూపాడు!! అది చూసిన గుమస్తా మా వైపు తిర్గి "మీర్రేవుల్లోకెల్లండి, వాళ్ళొచ్చేస్తున్నారు" అన్నాడు.

ఆ ఏర్పాట్లకు మేం విస్తుబోయి చూస్తుండగానే.... ఆవలి రేవులో పడవకదిలింది. !

"పడవొస్తుందిగాని ఎక్కి పోండిబాబూ ! అవతల నా బండికి నారేసుకోవాల" అంటూ వెను తిరుగుతున్న కరీంమియాతో "అదేంటి మియా ? జట్కాకిరాయి తీసుకోకుండానే పోతానంటావేంటి?!" అంటూ డబ్బులు తీసిచ్చిన నాన్న "చాలా సంతోషం కరీంమియా ! చాలా సాయంజేశావు" మనస్ఫూర్తిగా అంటూ కరీంమియా భుజం తట్టాడు.

అప్పుడు కరీం "అదేందిబాబూ ! అట్ల మాట్లాడుతుండ్రు !? మా... రామనర్సయ్యగారి చుట్టాలు మా అందరికీ చుట్టాలే..." అన్నాడు.

కరీంమియా హృదయపులోతుల్లో నుండి వస్తున్న ఆ... ఉమ్మడి బ్రతుకుల కమ్మని పలుకులు మా గుండెల్లో ఆనందభైరవి ఆలపించినట్టనిపించి, కనుకొలుకుల్లోనుండి అనుభూతి ముత్యాలు జారాయి.

★ ★ ★

అప్పుడే వచ్చిన ప్రభబండ్లకు కట్టిన మైకుల మోతతో మధురమైన ఆలోచనల హరివిల్లు చెదిరిపోయి కళ్ళు తెరచే సరికి ఆటోవచ్చి కరీంమియా జట్కాబండి ఆపే మర్రిచెట్టుకిందే ఆగింది !

ఇప్పుడా చెట్టు వటవృక్షమై ఊడలు దిగిఉంది. రక రకాల దుకాణాలు జనంతో కిటకిట లాడుతున్నాయి. ఆ చుట్టుపక్కల చాలా కాటేజీలు నిర్మించారు. మొత్తం మీద ఈ ఇరవై ఏండ్లలో ప్రశాంత గంభీరంగా ఉండే గుడి పరిసరాలు ఊహించనంతగా నగరీకరం చెందాయి. చిత్రంగా ఎవరిచేతుల్లో జూసినా రక రకాల సెల్‌ఫోన్లు రక రకాల రింగ్‌టోన్లతో విన్పించ సాగాయి...!

కలవాలని ఆశ పడుతున్న కరీంమియా మాత్రం కన్పించడం లేదు. ఆ చెట్టు దగ్గర్లోనే ఉన్న కుళాయి దగ్గర కాళ్ళూ, చేతులు కడుక్కుని వచ్చి చెట్టు నీడలో నిల్చున్నాను. చెట్టునీడ కరీంమియా స్నేహంలా హాయిగా అన్పిస్తుంటే... ఆలోచనలు మళ్ళీ గతం తలుపులు తెరిచాయి.

**తెలుగు అకాడమీ**

తెలుగు భాషను, అధికార భాషగా అభివృద్ధి పరచటానికి సూచన లిచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జె.పి.యల్. గ్విన్ అధ్యక్షతన ఒక నిపుణుల సంఘాన్ని ఏర్పరచింది. రాష్ట్ర భాషా సంస్థ నొక దానిని నెలకొల్పాలని ఈ నిపుణుల సంఘం సూచించింది. ఉన్నత విద్యా స్థాయిలో ప్రాంతీయ భాషలను బోధనా మాధ్యమాలుగా ప్రవేశ పెట్టేందుకు ప్రాంతీయ భాషా సంస్థలను స్థాపించటానికి భారత ప్రభుత్వం ఒక ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వాలకు 1967లో అందించింది. ఈ నేపథ్యంలో తెలుగు అకాడమీ ఆగష్టు 8, 1968 నుండి పని చేయడం ప్రారంభించింది.

★ ★ ★

మెల్లగా రేవులోకి దిగాం
పడవ కోసం చాలా మంది
కాసుక్కూర్చున్నారు.
పడవ నది మధ్యలోకొచ్చింది

ఆవలి రేవులో చాలా మంది జనం పోగౌతున్నారు !

పడవ మా రేవుకొచ్చి ఆగింది. "రామనర్సయ్యగారింటి కొచ్చిందెవరు బాబూ ?' అడిగాడు అప్పటి దాకా చుక్కాని పట్టిన ముసలాయన.

"మేమే..." మామయ్య చెప్పాడు.

"రాండి బాబూ ! ఎక్కండి" మెట్ల చెక్కను కిందకు జారవిడుస్తూ అన్నాడు మరో పడవతను. మేమిక్కిందాకా పక్కకు జరిగి నిల్చున్న మిగతా ప్రయాణీకులు, మేమెక్కగానే చక,చకా ఎక్కేశారు. పడవ మెల్లిగా గింజుపల్లి రేవుకేసి కదలసాగింది.

అందర్లాగే మేమూ డబ్బులు ఇవ్వబోతే "అయ్‌బాబో ! రామనర్సయ్యగారి చుట్టాల దగ్గర డబ్బులు తీసుకుంటా మటండీ ! తప్పుగదూ!" అంటూ మా దగ్గర ససేమిరా డబ్బులు తీసుకోలేదు. స్థిమితంగా కూర్చున్న తరువాత పడవలో వాళ్ళందరిని పరిశీలనగా చూశాను. ఒకావిడ గొంగూర తుంచి పక్కనే ఉన్న మేక పిల్లకు తినిపిస్తుంది. పడవ మధ్యలో పరచిన తడిక మీద కూర్చున్న ఓ పిల్లతల్లి బిడ్డకు పాలిస్తూనే ఇంకో పిల్లతల్లికి పేలుచూస్తుంది. ఆ పక్కనే కూర్చున్న ముసలాళ్ళిద్దరు దమ్ము కొడుతున్నారు. ఎడంపక్క పడవ అంచున కూర్చున్న ఇద్దరు యువకులు నిన్నరాత్రి జగ్గయ్యపేట టూరింగ్ టాకీస్ లో చూసొచ్చిన ఎన్టీవోడి సినిమాకథ చెప్పుకుంటున్నారు. చుక్కాని

వైపు నిల్చున్న కన్నె పిల్లలిద్దరు గాల్లోకి లేచిపోతున్న వోణీలను బలంగా అదిమిపట్టి బొడ్లో దోపుకుంటుంటే... వాళ్ళకి ఎదురుగా కూర్చున్న కోణంగులిద్దరు కొంటె మాటలు రువ్వుతున్నారు. అక్కడున్న వాళ్ళందరిలోనూ ఓ పల్లెటూరి నిర్మలత్వం కొట్టొచ్చినట్టు కన్పించసాగింది.

పడవ నడిచినట్టేలేదు ! గింజుపల్లి రేవుకు చేరుకున్నాం.

రేవులో రామనర్సయ్య గారితోసహా మాకోసమే ఎదురు చూస్తున్న ఊరిజనం పడవ దిగిన మాకెదురొస్తూ.... "రండి ! రండి ! మీ కోసమే ఎదురు చూస్తున్నాం" అంటు మధ్యవర్తి సాదరంగా ఆహ్వానించాడు. అక్కడున్న ఊరి వాళ్ళందర్నీ పేరు పేరున పరిచయం చేశాడు. ఆ... ఊరుమ్మడితనం మా ఊహల్లోక్కూడా అందని మధురమైన అనుభవం.

రేవులో నుండి మొదలైన వాళ్ళ ఆదరణా... ఆప్యాయతలు మమ్మల్ని ఊపిరికూడా సలుపనివ్వలేదు.

మాటా... మంతి జరిగాయి. ఇరువైపులా అన్ని విషయాలు, అందరికీ నచ్చాయి.

సంబంధం ఖాయమైంది.

సంతృప్తిగా తిరుగు ప్రయాణం ప్రారంభమైంది. ఊరంతా కదిలొచ్చి రేవుదాకా సాగనంపింది.

వేదాద్రి రేవుకు చేరుకొని మళ్ళోసారి దైవదర్శనం చేసుకొని బైటికొచ్చామో లేదో "రండి బాబూ ! రండి ! మీకోసమే ఎదురు జూస్తున్నా. చీకటి బడితే మీ కిబ్బందైద్దని" ఎదురొస్తూ అన్నాడు కరీంమియా.

"అయ్యో ! పాపం ! మా కోసం ఎదురు చూస్తున్నావా !?" అంటూ జట్కాఎక్కి కూర్చున్నాం.

జట్కా జగ్గయ్యపేటవైపు దౌడుతీస్తుంటే... మెల్లగా వెనక్కి తిరిగి 'ఎల్లినపని పండా? కాయా? బాబూ !" అంటూ అడిగాడు కరీంమియా.

"నువ్‌చెప్పిం తర్వాత పండేగాని, కాయెట్టైతది!?"

**హర్ష**

6-8-1986న మొదటి భారతీయ టెస్ట్ ట్యూబ్ బేబీ జన్మించింది.

ఈ టెస్ట్ ట్యూబ్ బేబీని అందించిన వారు డా॥ ఇందిర హిందూజ.

ఈ బేబీ పేరు 'హర్ష'.

మామూలుగానే చాలా తక్కువగా మాట్లాడేనాన్న సంబంధం కుదిరిందన్న ఆనందంలో గల, గల మాట్లాడుతుంటే.... మామయ్యతో బాటు నేనూ ఆశ్చర్యపోయాను.

నాన్న మాటలకు కొంచెం సిగ్గుపడుతూ... "నాదేముంది బాబూ ! అంత ఆ... ఏలాద్రి సామిదయ" అంటు గుడివైపు చేతులెత్తి చూపిస్తూ అన్నాడు కరీంమియా...

జగ్గయ్యపేట చేరేంత వరకు కరీంమియా ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడు.

చెల్లిపెళ్ళి, అత్తవారింటికి కాపురానికి వెళ్ళేదాకా నేనెన్నిసార్లు గింజుపల్లి వెళ్ళానో లెక్కేలేదు. వెళ్ళిన ప్రతిసారీ కరీంమియా జట్కాబండి తప్పదుకాబట్టి మా ఇద్దరి మధ్య పరిచయం, స్నేహంగా మారి గాఢంగా అల్లుకుపోయింది. దానికి వయసు వ్యత్యాసాలు కూడా అడ్డంకి కాలేదు.

ఆ.. స్నేహబంధం జీవిత సంద్రంలో బ్రతుకు అవసరాల ఆటు పోట్లకు విచ్ఛిన్నమై పోయింది. ఒక అల నన్ను అమెరికాదాక విసిరేయడంతో ఇరవైఏండ్ల ఎడబాటు ఏర్పడింది.

★ ★ ★

ఓ... టూరిస్ట్ బస్సు నిండా వచ్చిన యాత్రికుల కోలాహలంతో ఆలోచనలు చెదిరిపోవడంతో...? అక్కణ్ణుండి నెమ్మదిగా గుడివైపు కదిలాను.

పుష్కరాలకోసం చేసిన ఏర్పాట్లతో గుడి పరిసరాలు కనువిందు చేస్తున్నాయి.

యాత్రికుల రద్దీలో సైతం నా కళ్ళు కరీంమియా కోసం వెతుకుతూనే ఉన్నాయి.

నదిలోకి దిగే తొలి మెట్టు మీద నిలబడిన నాకు గత మంతా కళ్ళ ముందు కదలాడసాగింది.

రేవునిండా భక్తులు, వాళ్ళ మధ్య రక రకాల వస్తువులమ్ముకుంటూ తిరుగుతున్న చిల్లర వ్యాపారులు.

ఆయిల్ ఇంజన్లతో నడుస్తున్న పడవలు రెండు

ఎదురెదురుగా వస్తున్నాయి. వాటిని గమనించిన నేను "ఓహో మనుషులు కష్టపడి తెడ్లు వేయకుండా ఇదో మంచి మార్పేనే!" అనుకున్నా.

సరిగ్గా అప్పుడే...!!?

దూరంగా రేవులో జనం మధ్య 'టి' క్యాన్ పట్టుకొని అటూ.... ఇటూ.... తిరుగుతున్న ఓ వ్యక్తి నా దృష్టిలోకొచ్చాడు ! అదేనడక ! అదే(డస్సు ! అదే టోపి కాకపోతే ఇతను ముసలాడు ! అతను వయసోడు. ఔను ముసలాడే... ఇరవై ఏండ్ల తరువాత ఎలా ఉంటాడు? ఇలాగేఉంటాడు. ఎన్ని బాధ్యతల బరువులు మోశాడో ? ఎన్ని సమస్యల సుడులలోబడి విలవిల్లాడాడో ? సందేహంలేదు ఇతనే అతను మరైతే జట్కా బండేమైంది !? ఈ...'టీ' లమ్ముతున్నాడెందుకు ? ఏం అమ్మగూడదా ? అమెరికాలో నేనెన్ని ఉద్యోగాలు చెయ్యలేదు ? ప్రశ్నలు, ప్రశ్నలు నదిలోని అలల్లా ప్రశ్నలు తరుముకొస్తుంటే ఇహ అక్కడ నిలబడలేక గబ, గబా మెట్లుదిగి అతన్ని చేరుకునే సరికి, అతను అటువైపు తిరిగి ఎవరికో 'టి' అందిస్తున్నాడు. ఉద్వేగపు పొర ఏదో నా స్వరాన్ని వణికిస్తుంటే... "కరీంమియా..." అన్నాను.

"ఆ" వెనక్కి తిరిగాడతను.

"ఔను కరీంమియానే... !!" అనుకున్నా కళ్ళకు చత్వారం అద్దాలు, రాలిపోయిన ముందుపండ్లు, పండిపోయిన జుట్టు బాగా ముసలాడై పోయాడు ! నా ఆలోచనల్లో నేనే...

నన్ను గుర్తు పట్టలేని కరీంమియా 'ఎవరు బాబూ" అన్నాడు కళ్ళద్దాల్లో నుండి తలపైకెత్తి చూస్తూ.

"నేనుకరీం!" అంతకు మించి మాటరావడం లేదు.

"................" గుర్తుపట్టలేని అసహాయత.

"కన్నయ్యను కరీం !"

"కన్నయ్యా....!?" సాలోచనగా అంటున్న అతని కన్నుల్లో.... బుస, బుస మని ఒక్కసారిగా ఆశ్చర్యపు పొంగులు ! నన్ను గుర్తు పట్టాడనడానికి గుర్తుగా....

"బాబూ ! మీరా !!? ఎన్నేండ్లకి ?" అంటూ నా దగ్గరకొచ్చి 'టి' క్యాన్ని వదిలేసి కౌగిలించు కున్నాడు. మా కళ్ళల్లో ఆర్ద్రతా ఊటలు, మాటలు రాక పేరుకు పోతున్న మౌనం ఒక్క సారిగా మా స్నేహ సౌరభాన్ని హిందోళీకరించి మా చుట్టూ ఉన్న వాయుతరంగాల్లో సంయోజనం చెందసాగింది....

ఆక్షణంలో మమ్ముల్ని చూస్తున్న రేవులోని జనం ఒకింత ఆశ్చర్య పడడం నాకు తెలుస్తూనే ఉంది.

కొంత సేపటికి తేరుకున్న నేను "ఏంటిదికరీం! ఇంతలా మారిపొయ్యావేంటి !? ఈ 'టీ' లమ్ముతున్నావెందుకు ?! జట్కా ఏమైంది ? రాముడెలా ఉన్నాడు?" నా ప్రశ్నల్లో పరిపక్వతాలేమి తెలుస్తూనే ఉంది.

"రాముడా !? రాముడెప్పుడో చచ్చిపోయ్యాడు బాబూ ! వాడితోబాటే ఆ.. జట్కా బండీ మూలనబడింది. ఈ రోజుల్లో ఇంకా ఆ... జట్కా బండ్లెవరెక్కుతారు బాబూ !? ఆటోలు, జీపులు, కార్లు కావాల్సినన్నిచ్చినై. ఆ రాముణ్ణీ, జట్కాను నా భార్యా పిల్లలే ఎప్పుడో మర్చిపొయ్యారు. ఐనా మీరింకా గుర్తుపెట్టు కున్నారాబాబూ!?" కరీంమియా మాటల్నిండా ఆశ్చర్యపు మెరుపులే...

"అదేంటికరీం!? మనస్నేహాన్ని, ఆ రాముణ్ణీ ఎలా మర్చిపోతాననుకున్నావ్?! " నాకంఠంలో అభిమానవు నిష్ఠూరత.

ఎప్పుడో అమిరికా ఎల్లిపోయిన మీకింకా నేను గుర్తున్నానంటే అది మీ గొప్పతనం బాబూ !.

ఇంతలో పడవ రేవులోకొచ్చి ఆగింది. వచ్చిన పడవకేసి చూస్తున్న నా మనసు చదివినట్టే "ఏంటి బాబూ ! తెడ్లియ్యకుండ నావను ఆయ లింజన్లతో నడుపు తున్నారనా ? కాలం మారి పోయింది బాబూ ! ఎవ్వరు వోటు కష్టం జెయ్యట్లే.... ఏపనైనా సులభ సూత్రంగ జేస్తున్నారు." అన్నాడు కరీంమియా.

**రవీంద్రనాథ్ టాగూర్**

చిత్రకారుడు, కథకుడు, నవలాకారుడు, కళావిమర్శకుడు, విద్యావేత్త అయిన టాగూర్ ఆగష్టు 7, 1941వ సం॥లో మరణించారు. మొదటి నుంచీ ఈయన ప్రకృతి ఆరాధకుడు. 1913లో 'గీతాంజలి' అనే వీరి కవితా సంపుటికి నోబెల్ బహుమతి లభించింది. రవీంద్రుడు స్థాపించిన శాంతి నికేతన్ నేడు **"విశ్వభారతి యూనివర్సిటీ"** గా ప్రసిద్ధి పొందింది. గాంధీజీ వీరిని 'గురుదేవ్' అని సంబోధించారు. కలకత్తా కాంగ్రెస్ సభలో పాడేందుకు వీరిచే రచింపబడిన 'జనగణమన' గేయం మన జాతీయగీతమైంది.

"ఔనుకరీం నా ఊహల్లో ఉన్న వేదాద్రికీ.... నేను చూస్తున్న వేదాద్రికీ ఎక్కడా పోలికే లేదు. సిటీల్లో ఉన్న వాళ్ళకంటే కూడా ఇక్కడున్న వాళ్ళు ఎక్కువమంది సెల్‌ఫోన్లు వాడుతున్నారు." ఆకాశంలో కొండల్లా పెరుక్కొస్తున్న నల్లటి మబ్బుల్ని చూస్తూ.... అన్నాను.

"అదా ? గుడివైక్, ఇప్పుడెవ్వరికీ ఇయ్యట్లే... అందుకే కిష్టవతలోళ్ళంతా ఫోన్లు పెట్టించుకుంద్రు, ఐనా ఏంలాభం?" అన్నాడుకని పించని అలజడి ఏదో అతని స్వరంలో లీలగా కదలాడు తుంటే...

"ఏమైంది?"" అడిగాను ఏదో జరిగే ఉంటుందన్న ఆలోచన నాలో మొలక రిస్తుంటే...

'ఏముంది బాబూ ! ఏ... అద్దమరేత్రికాడో అన్నలు రావడం టెలిఫోన్ ఆఫీసులు పేల్చెయ్యటం! దాంతోటి మల్ల ఆరేడు నెల్లదాకా ఫోన్లు బంద్. ఈ గోలంతెందుకని లేసినోడు, లేవనోడు అందరూ సెల్ ఫోన్లు కొనుక్కుంటుంద్రు" ఈ ఊళ్ళో కాలు మోపిన దగ్గర్నుండి నా మదిలో మెదులుతున్న సందేహం నివృత్తి అయ్యేలా అసలు విషయం వివరించాడు కరీంమియా.

"అదా సంగతి" ఏక్షణంలోనైనా వర్షం పడేలా ఉంది.

"ఔను బాబూ !" ఫెళ, ఫెళా ఉత్తర దిశగా ఉరుములు

"అది సరేగాని కరీం ! ఈ వయసులో .... ఈ ఇసుకలో... ఈ జనం మధ్య, ఈ టీ క్యాను పట్టుకొని తిరగడం కష్టమని పించడంలేదా ?!" చిటపట, చిటపట చినుకులు రాలుతునే ఉన్నాయి.

రేవులో జనమంతా తుపాకీ శబ్దం విన్న చెట్టు మీద పక్షుల్లా మెట్లమీదిగా గుళ్ళోకి పరుగో పరుగు.

నేనూ... కరీం వర్షంలో తడుస్తూ... నే చివరి మెట్టు మీద కూర్చుని కాళ్ళను నీళ్ళలో వదిలేశాం. మాలాంటి వాళ్లింకొందరు అక్కడక్కడా మిగిలి ఉన్నారు !

**నాగసాకి డే**

జపాన్‌లోని నాగసాకి పట్టణం అమెరికన్ బాంబు దాడికి ఆగష్టు 9, 1945న గురై సుమారు 80వేల మంది మరణించారు. బాంబుల ప్రయోగా నంతరం రెండు రోజులపాటు వేడి వాయువులతోపాటు నల్లటి వర్షం కురిసింది. ఆ తర్వాత హిరోషిమా, నాగసాకి పట్టణాలను పునర్మించారు. నాగసాకి నేడు నౌకానిర్మాణానికి, 'మజ్దా' కార్లకు పేరుపొందింది.

ఇందాకటి నా ప్రశ్నకు సమాధానంగా "కష్టమెందుకు బాబూ ! బతకడానికి ఏదో ఒకటి చెయ్యాలిగా.... మా తాతలు, తండ్రులు జయంతిపురం కోటలో కావలి దార్లుగా బతికింద్రుట. మా కాలం వచ్చే తలికి కోటలో పన్లు దొరక్క కూలి, నాలి జేసుకుంట బతకసాగినం. నేను మాత్రం ఆ జట్కాబండి బెట్టుకొని రోజులు నెట్టుకొచ్చిన, చూస్తుండగనే. కాలం మారిపోబట్టింది. రిక్షాలొచ్చి నాగిరాకీ సగం దగ్గింది. ఐనా నీళ్ళా మాటగా కాలం నెట్టుకొన్తుండగానె. ఆటోలొచ్చిపడ్డయ్. ఆ దెబ్బతో నా జట్కాబండి పూర్తిగా మూలబడ్డది. మాతో పాటు గుఱ్ఱానికి కరువొచ్చింది. అంతలోనే దానికేదో జబ్బుజేసి చచ్చిపోయింది. బతుకు తెరువుకు రక రకాల పనులు జేసిన. పిల్లలు పెద్దోళ్లై పెండ్లిల్లు జేసుకొని ఎవరి బతుకు వాళ్ళు బతుకుతుంద్రు నేనూ... నా ముసల్దీ బతకడానికి ఈ 'టి' డబ్బాసాలు" బ్రతుకు సమరంలో అలుపెరగని సిపాయిలా తన బ్రతుకును నా ముందు గుమ్మరించాడు కరీంమియా.

"........" నాకు మాటలు కరువయ్యాయి. కాళ్ళక్రింద ఉన్న రాళ్ళను తీసుకొని నదిలోకి విసురుతున్నాను,

తనే మళ్ళీ" అటు చూడండి ! కన్నయ్యబాబూ ! ఆ.... కిష్టతల్లికి వచ్చే నీరు వస్తుంటే... పొయ్యేనీరు పోతూనే ఉంటుంది. మన బతుకులూ అంతే... ఎప్పుడూ ఒక్క తీరుగ నిలవాలంటే కుదర్నేకుదర్దు. నా చిన్నవ్వట్నుంచి ఆ కిష్టతల్లిని జూసే బతకడమెట్లానో నేర్చుకున్నా. కరీంమియా చెబుతునే ఉన్నాడు.... జీవితాన్ని కృష్ణమ్మతో పోలుస్తూ.... చెబుతున్న కరీంమియా నాకళ్ళకు జట్కా కరీంలా కాదు ! ఓ... తత్త్వవేత్తలా... కన్పించసాగాడు... !

చినుకులు పడుతునే ఉన్నాయి.... కరీంమియా ద్వారా జీవన తత్త్వాన్ని బోధించిన కృష్ణమ్మ నన్ను ఆశీర్వదిస్తూ... దుర్గమ్మ వైపు సాగిపోతూనే ఉంది...... ★